## క్లుప్తంగా

### పాలాభిషేకం



సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న దళిత నేతలు, ఆటోడ్రైవర్లు

**పుంగనూరు:** ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి మంగళవారం దళిత నాయకులు, ఆటోడ్రైవర్లు పాలాభిషేకం చేశారు. పట్టణంలోని ఇందిరా సర్కిల్‌లో ఈ కార్యక్రమం నిర్వహించారు. సీఎంతోపాటు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ వెంకట మిథున్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. 'వాహనమిత్ర' పథకంతో ఆటోడ్రైవర్లను సీఎం ఆదుకుంటున్నారని కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో దళిత నాయకులు రాజు, డ్రైవర్లు నాగరాజ, రమేష్, బాషా తదితరులు పాల్గొన్నారు.

### కాణిపాక ప్రచార రథానికి పూజలు



దేవళంపేటకు వచ్చిన వినాయక స్వామి ప్రచార రథం

**పులిచెర్ల(కల్లూరు):** కాణిపాకంలోని వరసిద్ధి వినాకక స్వామి దేవస్థాన ప్రచారం రథం మంగళవారం మండలంలో దేవళంపేటలోని లక్ష్మీ నరసింహస్వామి ఆలయానికి చేరింది. వినాయకునికి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు అనంతాచార్యులు భక్తులకు స్వామి వారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

### పోలీస్‌స్టేషన్ తనిఖీ



మహిళా పోలీసులతో మాట్లాడుతున్న సీఐ కృష్ణారెడ్డి

**సదుం:** పోలీస్‌స్టేషన్‌ను సీఐ కృష్ణారెడ్డి మంగళవారం తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. అనంతరం మహిళా పోలీసులతో సమావేశమయ్యారు. ఎక్కడైనా అసాంఘిక, చట్టవ్యతిరేక కార్యకలాపాలు జరుగుతున్న పక్షంలో తమ దృష్టికి తేవాలన్నారు. విధుల విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ మారుతి పాల్గొన్నారు.


### రోగులకు మెరుగైన వైద్య సేవలు



చర్చిస్తున్న ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు, సిబ్బంది

**సదుం:** స్థానిక సీహెచ్‌సీలో రోగులకు సిబ్బంది మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నట్టు ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ కృష్ణారెడ్డి అన్నారు. ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఆసుపత్రి అభివృద్ధి కోసం తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. అవసరమైన సామగ్రి కొనుగోలు చేయాలని తీర్మానించారు. కార్యక్రమంలో మెడికలాఫీసర్ డాక్టర్ పుష్పకుమారి, సభ్యులు రమాదేవి, మురళి, విశ్రాంత ఉపాధ్యాయుడు మల్‌రెడ్డి, డాక్టర్లు పాల్గొన్నారు.

### మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థికసాయం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

**రామకుప్పం:** మండలంలోని గోవిందపల్లెకు చెందిన మునివెంకటప్ప మంగళవారం మృతి చెందాడు. ఇది తెలుసుకున్న చిత్తూరు ఎమ్మెల్సీ భరత్ వైఎస్సార్ సీపీ నేతల ద్వారా రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో రెస్కో డైరెక్టర్ నాగిరెడ్డి, బళ్ల సర్పంచ్ విజయ్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

### అభివృద్ధి పనులకు రూ.80 లక్షలు మంజూరు

**బైరెడ్డిపల్లి:** మండలంలో పలు అభివృద్ధి పనులకు ఎంపీ నిధుల కింద రూ.80 లక్షలు మంజూరు అయ్యాయని ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప తెలిపారు. బైరెడ్డిపల్లె బీసీ కమ్యూనిటీ భవన నిర్మాణానికి రూ.10 లక్షలు, పట్నపల్లెలో బీసీ కమ్యూనిటీ భవన నిర్మాణానికి రూ.10 లక్షలు, కార్వేటికొండ కమ్యూనిటీ భవన నిర్మాణానికి రూ.5 లక్షలు, తీర్థంలో కమ్యూనిటీ భవనానికి రూ.10 లక్షలు, బైరెడ్డిపల్లె ఇందిరమ్మ కాలనీలో సీసీ రోడ్ల పనులకు రూ.5 లక్షలు, బైరెడ్డిపల్లె ఎంపీడీఓ కార్యాలయంలో ఆర్‌ఓ ప్లాంట్ ఏర్పాటుకు రూ.5 లక్షలు, బైరెడ్డిపల్లెలో 2 బస్‌షెల్టర్ల నిర్మాణానికి రూ.5 లక్షలు, మురారిపల్లెలో సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.30 లక్షలు మంజూరైనట్లు ఆయన వివరించారు.

### 21న స్పెషల్ లోక్ అదాలత్

**పుంగనూరు:** పట్టణంలోని కోర్టు ఆవరణలో ఈ నెల 21న స్పెషల్ లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నట్టు సీనియర్ సివిల్‌జడ్జి వాసుదేవరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అదాలత్‌లో రాజీ కాదగిన రెవెన్యూ కేసులను పరిష్కరిస్తామన్నారు. న్యాయవాదులు, కక్షిదారులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యం



వి.కోట : బాలికల ఉన్నత పాఠశాలలో..



రొంపిచెర్ల : బాలుర ఉన్నత పాఠశాలలో కళ్లద్దాలను పంపిణీ చేస్తున్న ఎంపీపీ పురుషోత్తంరెడ్డి

- జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలకు స్పందన
- వైద్యపరీక్షలు చేసి మందులు పంపిణీ



చౌడేపల్లె : కళ్లద్దాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ రామ్మూర్తి



రొంపిచెర్ల : శిబిరాన్ని ప్రారంభిస్తున్నఅధికారులు, ప్రజాప్రతినిధులు



పలమనేరు : చికిత్సకు పేర్లు నమోదు చేసుకుంటున్న ప్రజలు



గంగవరం : ప్రజలకు వైద్య పరీక్షలు చేస్తున్న ఆరోగ్య సిబ్బంది



పెద్దపంజాణి : కళ్లద్దాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ రెడ్డెప్ప



బైరెడ్డిపల్లె : గడ్డూరులో..

#### పలమనేరు నియోజకవర్గం

**పలమనేరు:** వైద్యం కోసం పేదలు ఇబ్బందులు పడరాదనే ఉద్దేశంతో ప్రభుత్వం పేదల ముంగిటకే జగనన్న ఆరోగ్య సురక్షతో వైద్యసేవలకు శ్రీకారం చుట్టిందని ఎంపీడీఓ విద్యాసాగర్ అన్నారు. మండలంలోని జరావారిపల్లెలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. వైద్యం కోసం పలువురు పేర్లు నమోదు చేసుకున్నారు. ఎంపీపీ రోజా, జెడ్పీటీసీ మల్లిక, పార్టీ మండల కన్వీనర్ బాలాజీనాయుడు, రాష్ట్ర కార్యదర్శి రంగన్న, సింగిల్‌విండో చైర్మన్ రాజారెడ్డి, వైద్యులు, ఆరోగ్య, మున్సిపల్, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

**గుండుగల్లులో..**

**గంగవరం:** ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యాన్ని ప్రసాదించడమే జగనన్న ఆరోగ్య సురక్ష లక్ష్యమని ఎంపీపీ వెంకటరమణ అన్నారు. మంగళవారం మండలంలోని గుండుగల్లు సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఎంపీపీ, సర్పంచ్ రమణ దీనిని ప్రారంభించి మాట్లాడారు. అనంతరం ప్రజలకు వైద్యపరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్యాధికారి సర్తాజ్, తహసీల్దార్ అమర్నాథ్, సచివాలయ ఉద్యోగులు, గ్రామ వలంటీర్లు, పార్టీ నాయకుడు చలపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**కోగిలేరులో..**

**పెద్దపంజాణి:** మండలంలోని కోగిలేరు సచివాలయ ఆవరణలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఎంపీపీ రెడ్డెప్ప ప్రారంభించారు. శిబిరంలో 303 మందికి వైద్యుల బృందం వైద్యపరీక్షలు చేసి ఉచితంగా కళ్లద్దాలు, మందులు, ఆయుష్మాన్ భారత్ గుర్తింపు కార్డులు పంపిణీ చేసింది. సర్పంచ్ రమేష్‌బాబు, వైస్ ఎంపీపీ ఆంజమ్మ, కో–ఆప్షన్ సభ్యుడు రహంతుల్లా, వైద్యాధికారులు మౌనిక, వినీత, మురళీకృష్ణ, శ్రీనివాస్, ఎంపీడీఓ అబ్దుల్‌రహీం, తహసీల్దార్ లోకేశ్వరరావు, పీఎస్ మహేశ్వర్, ఎంపీటీసీ పరంధామ, సచివాలయ కన్వీనర్ శివశంకర్ రెడ్డి, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ బాగారెడ్డి, ఎంఆర్సీ సుధాకర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

**గడ్డూరులో..**

**బైరెడ్డిపల్లె :** మండలంలోని గడ్డూరులో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఎంపీడీఓ రాజేంద్ర బాలాజి ప్రారంభించారు. వైద్యాధికారులు విజయ్‌చంద్ర, అరుణ్‌కుమార్ రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

**వి.కోటలో..**

**వి.కోట:** స్థానిక బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో ఓగు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రాజేష్ నాయక్, ఈఎన్‌టీ స్పెషలిస్ట్ యుగంధర్, డాక్టర్ రాజేష్ తదితరులు మొత్తం 288 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు.

శిబిరాన్ని తహసీల్దార్ చిట్టిబాబు, ఎంపీడీఓ మహ్మద్ రఫీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పీఎస్ నాగరాజు పరిశీలించారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

#### పుంగనూరు నియోజకవర్గం

**చౌడేపల్లె:** మండలంలోని ఏ.కొత్తకోట ఉన్నత పాఠశాలలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఎంపీపీ గాజుల రామ్మూర్తి ఈ శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. వైద్యాధికారులు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. అలాగే వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో వృద్ధులకు కళ్లద్దాలను ఎంపీపీ పంపిణీ చేశారు. ఐసీడీఎస్ అధికారులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పౌష్టికాహార వస్తువుల ప్రదర్శన ఏర్పాటు చేశారు. సర్పంచ్ రిజ్వానా, వైస్ ఎంపీపీ నరసింహులు యాదవ్, పార్టీ మండల కన్వీనర్ అంజిబాబు, పీహెచ్‌సీ కమిటీ చైర్మన్ కళ్యాణ్, ఉపసర్పంచ్ వినోద్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ చిన్నా, ఎంపీడీఓ సుధాకర్, తహసీల్దార్ మాధవరాజు, ఎంఈఓ కేశవరెడ్డి,డాక్టర్ పవన్‌కుమార్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

**పాపిరెడ్డిగారిపల్లెలో..**

**పులిచెర్ల(కల్లూరు):** మండలంలోని పాపిరెడ్డిగారి పల్లెలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి ప్రారంభించి మాట్లాడారు. అనంతరం 176మందికి వైద్యపరీక్ష లు చేసి మందులు పంపిణీ చేశారు. వైద్యులు యల్ల ప్ప, రమ్యశ్రీ, వినయ్, ఎంపీడీఓ రాజశేఖర్, నాదముని రెడ్డి, రెడ్డీశ్వరరెడ్డి, ముర్వత్‌బాషా, నాగరాజ ప్రసాద్, రాశి ప్రసాద్, మధు, అమరావతి, భాస్కర్‌రెడ్డి, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**రొంపిచెర్లలో..**

**రొంపిచెర్ల:** స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో పౌష్టికాహార స్టాళ్లను ఏర్పాటు చేసి సంపూర్ణ ఆరోగ్యానికి దోహదపడే ఆహారం, చిరుధాన్యాలు, పాలు, పాలపదార్థాలు, ఆకుకూరలు తీసుకుంటే లభించే వైటమిన్లు గురించి ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శిరీష అవగాహన కల్పించారు. పౌష్టికాహారం ప్రదర్శన ఏర్పాటు చేశారు. అంగన్‌వాడీ టీచర్లు సుస్మిత, నాగరాత్న, రమణమ్మ, అరుణ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. అలాగే, బొమ్మయ్యగారిపల్లె గ్రామ పంచాయతీలోనూ జగనన్న సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఇక్కడ చికిత్స పొందడానికి 630 మంది పేర్లు నమోదు చేసుకున్నారని, అయితే శిబిరానికి రోగులను తీసుకురావడంలో వలంటీర్లు వైఫల్యం చెందారని ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శిబిరంలో 375 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. 45 మంది రోగులను పెద్ద ఆస్పత్రులకు రెఫర్ చేసినట్లు వైద్యాధికారులు తెలిపారు. సింగిల్‌విండో అధ్యక్షుడు దేవులపల్లె హరినాథ రెడ్డి, ఎంపీడీఓ రాజేంద్ర, డీటీ లోకేష్, వైద్యాధికారులు రిజ్వాన్, దినేష్ కుమార్ నాయక్, హరిప్రియ, సర్పంచ్ ఇబ్రహీంఖాన్, ఎంఈఓలు ఇందిర, శ్రీనివాసులు, సచివాలయ కన్వీనర్లు కోటా వెంకటరమణ, విజయ భాస్కర్ రెడ్డి, కరీముల్లా, కార్యదర్శి హరిబాబు, మహిళా పోలీస్ రేష్మా, ఆరోగ్య కార్యకర్త గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

#### కుప్పం నియోజకవర్గం

**పేదల ఇళ్ల వద్దకే వైద్యసేవలు**



రామకుప్పం : కళ్లద్దాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ నేత్రావతి



గుడుపల్లె : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో కుప్పం మున్సిపల్ చైర్మన్

**గుడుపల్లె:** పేదలకు ఇళ్ల వద్దకే ఉచిత వైద్య సేవలను ప్రభుత్వం అందిస్తోందని కుప్పం మున్సిపల్ చైర్మన్ డాక్టర్ సుధీర్ అన్నారు. మండలంలోని బెగ్గిలిపల్లెలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. వైద్యాధికారులు రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సింగిల్‌విండో మాజీ చైర్మన్ నాగభూషణం, ఎంపీడీఓ తాజ్ మస్రూర్, ఎంపీటీసీ వెంకటమ్మ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

**జరుగు సచివాలయంలో..**

**కుప్పం రూరల్:** మండలంలోని జరుగు సచివాలయంలో మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో 254 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. వైద్యాధికారి శుభాష్‌రాజ్ మాట్లాడారు. వైద్యులు షర్మిల, జశ్వంత్, సందీప్, హరిత, ఏఎన్‌ఎం మల్లేశ్వరమ్మ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

**రామకుప్పం మండలంలో..**

**రామకుప్పం:** మండలంలోని ఆనిగానూరు సచివాలయంలో విజలాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి అల్తాఫ్ హుస్సేన్, పీఈఎస్ వైద్యులు 248 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. చిన్న పిల్లలు, గర్భవతులు, షుగరు, బీపీ వ్యాధిగ్రస్తులనూ పరీక్షించారు. అలాగే వైఎస్సార్ కంటి వెలుగు పథకం కింద అర్హులకు ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ చేశారు. సర్పంచ్ నేత్రావతి, రెస్కో డైరెక్టర్ నాగిరెడ్డి, ఈఓఆర్డీ రాధాకృష్ణ, వైద్యాధికారి సాదియా, పంచాయతీ కార్యదర్శి బాబు, పీహెచ్‌సీ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## అటవీ సంపద కాపాడుకోవడం అందరి బాధ్యత



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న హెచ్‌ఎం శ్రీవాణి



పలమనేరు : మాట్లాడుతున్న ఎఫ్‌ఎస్వో శివన్న

**పులిచెర్ల(కల్లూరు):** వన్యప్రాణులు, అటవీ సంపదను కాపాడుకోవడం అందరి బాధ్యతని డిప్యూటీ ఫారెస్ట్ రేంజర్ జయశంకర్ అన్నారు. మంగళవారం కల్లూరు హైస్కూల్లో అటవీశాఖ వన్యప్రాణి వారోత్సవాల కార్యక్రమం నిర్వహించింది. పర్యావరణ పరిరక్షణ అటవీ సంపద పరిరక్షణపై ఆధారపడి ఉందని జయశంకర్ చెప్పారు. అడవులు, వన్యప్రాణులపై అవగాహన కల్పించేందుకు విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలోఎంఈఓ తాతయ్య, హెచ్‌ఎం శ్రీవాణి, అటవీశాఖ సిబ్బంది శ్రీదేవి, రెడ్డి ప్రసాద్, లావణ్య, శంకరప్ప ఉపాధ్యాయులు వెంకట సిద్ధులు, రాజేంద్ర, రాజశేఖర్, వేణుగోపాల్, స్నేహమాలిని తదితరులు పాల్గొన్నారు.

**పలమనేరులో..**

**పలమనేరు:** పలమనేరు ఫారెస్ట్ రేంజి అధికారులు పట్టణ సమీపంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం జాతీయ వన్యప్రాణి వారోత్సవాలను నిర్వహించారు. స్థానిక ఎఫ్‌ఆర్వో శివన్న మాట్లాడుతూ, అడవుల్లోని వన్యప్రాణులను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పలమనేరు కౌండిన్య అభయారణ్యంలో ఇటీవల ఏనుగులు కరెంట్ షాక్‌లకు గురై మృతి చెందడం బాధాకరమన్నారు. రైతులు సైతం తమ పొలాల వద్ద కరెంట్ తీగలను ఎత్తులో ఏర్పాటు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై ఇప్పటికే ట్రాన్స్‌కో అధికారులతోనూ చర్చించామన్నారు. అనంతరం పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ మొహమూద్ మాట్లాడారు. కార్యక్రమంలో ఎఫ్‌ఎస్వో సుకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

## వేరుశనగలో పంట కోత ప్రయోగాలు



పెద్దగొట్టిగల్లులో పంట కోతకు భూములను ఎంపిక చేస్తున్న ఏఎస్‌ఓ రాజేశ్వరి

**రొంపిచెర్ల:** మండలంలో వేరుశనగ పంట కోత ప్రయోగాలకు 16 మంది రైతుల భూములను గుర్తించామని ఏఎస్‌ఓ రాజేశ్వరి తెలిపారు. ఆమె మంగళవారం పెద్దగొట్టిగల్లు గ్రామ పంచాయతీలో ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగు చేసిన వేరుశనగ పంట దిగుబడిని పరిశీలించేందుకు భూములను గుర్తించారు. ఆమె మాట్లాడుతూ, పంట కోత ప్రయోగాలతో దిగుబడి ఎంత వస్తుందో అంచనా వేయవచ్చన్నారు. ఈ ఏడాది వేరుశనగ విత్తనాలు వేసిన 40 రోజుల వరకు వర్షం లేక పంట దెబ్బతిందని, ఆ తర్వాత వర్షాలు కురిసినా పంటకు మేలు కలిగించలేదని పేర్కొన్నారు. ఫలితంగా ఈ పర్యాయం దిగుబడి గణనీయంగా తగ్గుతుందని అంచనా వేస్తున్నట్టు చెప్పారు. పంట కోత ప్రయోగాలు చేసి ప్రభుత్వానికి నివేదిక పంపనున్నట్లు ఏఎస్‌ఓ చెప్పారు.

## తీరనున్న సాగునీటి కొరత



ప్రాజెక్టు పరిశీలిస్తున్న పెద్దిరెడ్డి

**సదుం:** మండలంలో సాగునీటి కొరత తీర్చేందుకు నూతనంగా మూడు మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్మాణ పనులు చేస్తుండటం విదితమే. ఈ నేపథ్యంలో ఇటీవల కురిసిన వర్షాలకు నిండిన చింతపర్తివారిపల్లె మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టును మంగళవారం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి పరిశీలించారు. ప్రాజెక్టుల నిర్మాణం పూర్తి కావచ్చినట్టు ఆయన చెప్పారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ శివారెడ్డి, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ రెడ్డెప్పరెడ్డి, సర్పంచ్ హనుమంతరెడ్డి, నాయకులు బాబురెడ్డి, దామోదర రెడ్డి, పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి పాల్గొన్నారు.

## ముగ్గురు ఉత్తమ టీచర్ల ఎంపిక



లోకనాథరెడ్డి



కృష్ణయ్య



రమణా రెడ్డి

**రొంపిచెర్ల:** మండలం నుంచి ముగ్గురు ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారని వైఎస్సార్ కడప జిల్లా జెడ్పీ చైర్మన్ ఏ.అమరనాథరెడ్డి సమాచారం ఇచ్చినట్లు ఎంఈఓ శ్రీనివాసులు మంగళవారం తెలిపారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు లోకనాథరెడ్డి, కృష్ణయ్య, కమ్మోళ్లపల్లె ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం రమణారెడ్డి విద్యాభివృద్ధికి చేసిన కృషికి గుర్తింపుగా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేశారని, ఈ నెల 5న అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా వైఎస్సార్ కడప జిల్లా జెడ్పీ కార్యాలయంలో వీరికి అవార్డులను ప్రదానం చేస్తారని తెలియజేశారు.

## వైద్య, ఆరోగ్య శాఖ సలహాదారుగా డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డి



నియామక పత్రాన్ని అందుకుంటున్న చంద్రశేఖర్ రెడ్డి

**పెద్దపంజాణి:** జిల్లా ప్రజా పరిషత్ సమావేశంలో వైద్య, ఆరోగ్య శాఖకు సంబంధించి సూచనలు–సలహాలు ఇవ్వడానికి ప్రత్యేక ఆహ్వానితులుగా మండలంలోని రాయలపేటకు చెందిన డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డిని నియమించారు. మంగళవారం చిత్తూరు జెడ్పీ సమావేశ మందిరంలో నియామక పత్రాన్ని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, జిల్లా కలెక్టర్ సగిలి షణ్మోహన్ చేతులు మీదుగా అందుకున్నట్లు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు.

**సాంఘిక సంక్షేమం, సామాజిక సేవల సలహాదారుగా అమరనాథ్**



మంత్రి నుంచి నియామక పత్రాన్ని అందుకుంటున్న అమరనాథ్

**వి.కోట:** సాంఘిక సంక్షేమం, సామాజిక సేవలకు సంబంధించి సలహాదారుగా జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు తనయుడు అమరనాథ్ నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్, జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

## వైఎస్సార్ సీపీలో జనసేన కార్యకర్తల చేరిక



పార్టీలో చేరిన జనసేన నాయకులు, కార్యకర్తలతో ఎమ్మెల్సీ భరత్

**కుప్పం:** గుడుపల్లె మండలం గుత్తార్లపల్లెకు చెందిన జనసేన పార్టీ కార్యకర్తలు ఎమ్మెల్సీ భరత్ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి భరత్ ఆహ్వానించారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌కు ఏ ఎండకా గొడుగు పట్టే నైజం అని తన మాటల్లో చాటుకున్నారని, టీడీపీని తిట్టినంత కాలం తిట్టి, ఇప్పుడు ఆ పార్టీతో జతకట్టి, పార్టీశ్రేణులకు షాక్ ఇచ్చారని, ఆయనకు ఒక అజెండా గానీ, సిద్ధాంతం అంటూ లేదని తేలిపోయిందన్నారు. అందుకే ఆ పార్టీకి గుడ్‌బై చెప్పామని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీలు, కులాలకతీతంగా నవరత్న పథకాల ఫలాలను అర్హులకు అందచేస్తుండటంపై ఆకర్షితులై వైఎస్సార్ సీపీలో చేరినట్టు చెప్పారు. పార్టీలో చేరిన వారిలో మండల జనసేన సహాయ కార్యదర్శులు శేఖర్, ధర్మతేజ, కార్యకర్తలు చంద్రకిరణ్, మోహన్, తరుణ్ కుమార్, మదన్ మోహన్, హేమరాజ్ , కిరణ్ కుమార్, వినోద్, హేమంత్, మరికొందరు ఉన్నారు.

## 9న టిడ్కో గృహ ప్రవేశాలు



టిడ్కో గృహాలను పరిశీలిస్తున్న కలెక్టర్ షణ్మోహన్, అధికారులు

- ఇళ్లను పరిశీలించిన కలెక్టర్ షణ్మోహన్

**పుంగనూరు:** పట్టణ సమీపంలోని గూడూరుపల్లెలో నిర్మించిన 1,532 టిడ్కో గృహాలను ఈనెల 9న ప్రారంభించనున్నట్టు జిల్లా కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. మంగళవారం సాయంత్రం ఆయన టిడ్కో గృహాలను సందర్శించారు. రోడ్లు, విద్యుత్, పైపులైన్లు, నీటి ట్యాంకుల నిర్మాణాల పనులను పరిశీలించారు. పేదలందరికి ఇల్లు కార్యక్రమంలో భాగంగా మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సొంత నియోజకవర్గంలో గృహ ప్రవేశ కార్యక్రమం ఘనంగా చేయనున్నట్టు చెప్పారు. ఇంకనూ మిగిలిన గృహ నిర్మాణ పనులను లబ్ధిదారులతో త్వరితగతిన పూర్తి చేయించి, ప్రవేశాలకు సిద్ధం చేయాలన్నారు. కలెక్టర్‌తో పాటు ఎస్‌ఈ జాన్‌సైమన్‌రావు, మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా కూడా గృహాలను పరిశీలించారు. కార్యక్రమంలో హౌసింగ్ పీడీ పద్మనాభం, ఎస్‌ఈ చంద్రశేఖర్, మెప్మా పీడీ రాధమ్మ, మున్సిపల్ కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డి, తహల్దార్ సీతారామన్ తదితరులు పాల్గొన్నారు.

## గృహ నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలి



గృహ నిర్మాణాలను పరిశీలిస్తున్న ఎంపీపీ ఈశ్వరయ్య, ఎంపీడీఓ నాగరాజ

**సోమల:** జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీపీ ఈశ్వరయ్య ఆదేశించారు. మంగళవారం ఎంపీడీఓ నాగరాజతో కలిసి స్థానిక జగనన్న కాలనీ లేఅవుట్–1ను ఆయన పరిశీలించారు. ఇళ్ల నిర్మాణ విషయంలో జాప్యం చేయరాదని, ఏవైనా ఇబ్బందులు ఉంటే అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధుల దృష్టికి తేస్తే సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ గణేష్, పంచాయతీ కార్యదర్శి సుధాకర్ కుమార్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.